క్లుప్తంగా

అర్హులందరికీ పథకాలు

చొప్పదండి: కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాలు అందుతాయని కాంగ్రెస్ చొప్పదండి పట్టణఅధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్ అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మేడిపల్లి సత్యంను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆరు గ్యారంటీలతో అర్హులకు లబ్ధి చేకూరుస్తామని తెలిపారు. కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చి బీఆర్ఎస్ అధినేతను ఫామ్‌హౌజ్‌కు పంపడానికి కాంగ్రెస్ కార్యకర్తలు నిర్విరామంగా కృషి చేశారని తెలిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సమావేశంలో పెరుమాండ్ల గంగయ్యగౌడ్, మునిగాల సుధాకర్ గౌడ్, గుర్రం రమేశ్‌గౌడ్, నిజానపురం చందు, కదారి శంకర్, మునిగాల రాజేందర్, మావురం రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న సర్పంచ్ ఆదిలక్ష్మి

ఇల్లందకుంట: మండలంలోని రాచపల్లి గ్రామానికి చెందిన గూడెపు రవీందర్ ఇటీవల మృతి చెందగా సర్పంచ్ బూస ఆదిలక్ష్మి సోమవారం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. రూ. 10 వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

సన్మానం



అనిల్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గన్నేరువరం: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు, మండల కేంద్రానికి చెందిన మాతంగి అనిల్‌ను పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గన్నేరువరంలో సన్మానించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మండల కేంద్రంలోని 192 పోలింగ్ బూత్‌లో కాంగ్రెస్ పార్టీకి 529 ఓట్లు రాగా బీఆర్ఎస్‌కు 229, బీజేపీకి 28 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 300 ఓట్లు అధికంగా రావడానికి కృషి చేసినందుకు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, రాపోలు నవీన్, ముక్కెర అభిలాశ్, న్యాత తిరుపతి, చంద్రమౌళి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'పారమిత' విద్యార్థులు



అభినందిస్తున్న హెచ్ఎం రితీష్ మెహతా

కొత్తపల్లి(కరీంనగర్): పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రితీష్ మెహతా తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన సీనియర్స్ మహిళా కబడ్డీ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో వి.అశ్విత(10వ తరగతి), బి.వంశిక (9వ తరగతి)లు ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. సోమవారం నుంచి ఈ నెల 6వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే, 67వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు ముగ్గురు ఎంపికయ్యారని అన్నారు. మంగళవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు నల్గొండ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-14 బాలుర విభాగంలో ఎల్.ప్రితమ్(7వ తరగతి), అండర్-17 విభాగంలో ఎల్.సుప్రీత్ (9వ తరగతి), టి.రిషికుమార్ (పదోతరగతి) ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు అనూకర్ రావు, రశ్మిత, ప్రసూన, వినోద్‌రావు, వి.యు.యం.ప్రసాద్ అభినందించారు. ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు రవీంద్రపాత్రో, రాము, హరిప్రియ, సరిత, పీఈటీ రాజు తదితరులున్నారు.

నేడు మహాపడిపూజ

కొత్తపల్లి: కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో గల అల్ఫోర్స్ విద్యా సంస్థల కేంద్ర కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 7 గంటల నుంచి అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవం, అల్పాహార ఏర్పాటు చేసినట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. లోకకల్యాణార్థమై, మానవాళి శ్రేయస్సుకై ఏటా అత్యంత వైభవోపేతంగా అయ్యప్ప మహాపడి పూజ నిర్వహిస్తున్నామని అన్నారు. చక్రవర్తుల పురుషోత్తమాచార్యుల గురుస్వామి ఆధ్వర్యంలో పదునెట్టంబడి పూజను శరణు ఘోష మధ్య నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పూజలో భాగంగా మహాగణపతి పూజ, సుబ్రహ్మణ్యస్వామి ఆరాధన, విశేష భజన జరుగుతుందన్నారు. పడిపూజ అనంతరం అల్పాహారం ఏర్పాటు చేసినట్లు, దీక్షాపరులు, భక్తులు విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులై ఆధ్యాత్మిక వాతావరణాన్ని శోభాయమానం చేయాలని కోరారు.

నీరు ఇంకేదెలా..?

- ఇంకుడుగుంతలకు అనుమతులిచ్చారు... పర్యవేక్షణ మరిచారు..
- నిబంధనలు విస్మరిస్తున్న ఇంటి యాజమానులు
- గ్రామాల్లో జోరందుకున్న ఇళ్ల నిర్మాణాలు



హుజూరాబాద్ రూరల్: వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపులో ఇంకుడుగుంతలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ ప్రజలు వీటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇళ్ల నిర్మించుకునే సమయంలో తప్పనిసరిగా ఇంకుడు గుంతను నిర్మించాలన్న నిబంధన ఉన్నప్పటికీ వాటి విషయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆశయం నీరు గారిపోయే పరిస్థితి నెలకొంది. హుజూరాబాద్ పట్టణ పరిధి దినం దినం విస్తరిస్తుండగా.. గ్రామాల్లో సైతం పూరి గుడిసెలు, పెంకుటిల్లు తొలగిస్తూ పక్కా భవనాల నిర్మాణాలు జోరందుకుంటున్నాయి. రెండేళ్ల నుంచి గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకుంది.

ఇంకుడుగుంతలకు అనుమతిలిచ్చారు... పర్యవేక్షణ మరిచారు..

గ్రామాల్లో ఇంటి నిర్మాణానికి తాజాగా ప్రభుత్వ సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుంటే అందులో ఉండే అనుమతులకు లోబడి ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అనుమతుల్లో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు తప్పనిసరిగా ఇంకుడు గుంతను నిర్మించాలన్న నిబంధన ఉంది. ఇంకుడుగుంత కొలతలను బట్టి చార్జీ వసూలు చేస్తుండగా నిర్మాణం పూర్తయినట్లు సంబంధిత రశీదులు అధికారులకు సమర్పిస్తే అధికారులు తిరిగి వినియోగదారుడికి డబ్బులు చెల్లిస్తారు. కానీ ఇప్పటివరకు ఇంకుడుగుంతలకు డబ్బులు చెల్లిస్తున్నారే తప్పా.. నిర్మించి డబ్బులు తీసుకునే దాఖలాలు ఇక్కడ కానరావడం లేదు. నిర్మాణాల విషయంలో అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షించాల్సి ఉండగా పట్టించుకోకపోవడంతో భూగర్భ జలాలు పెంచే ఆలోచన అటకెక్కుతోంది.

చైతన్యం రావాలి...

ఇంకుడుగుంతల నిర్మాణం ప్రజల చైతన్యంతోనే సాధ్యమవుతుంది. లేకపోతే భూగర్భ జలాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ సంవత్సరంలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో ప్రతి నీటిని ఒడిసిపట్టే ప్రయత్నం చేయాలి. మండలంలోని ప్రతి గ్రామంలో రెండు నుంచి మూడువరకు చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిలో నీటి సామర్థ్యం రోజురోజుకి తగ్గిపోతోంది. ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపడితే భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటే తప్ప భూగర్భజలాలు పెరిగే అవకాశం లేదు.

గాలి ఎటుంటే అటే..

- చొప్పదండి ప్రజల విభిన్న తీర్పు
- టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు మద్దతు
- నియోజకవర్గ ఓటర్ల ప్రత్యేకతే వేరు



చొప్పదండి: చొప్పదండి నియోజకవర్గ ప్రజలు గాలి ఎటువైపుంటే మేము అటే అని అంటున్నారు. గడిచిన ఐదేళ్లలో మూడు విభిన్న తీర్పులు ఇచ్చి తమ ప్రత్యేకత వేరని తెలియజేస్తున్నారు. రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిసారి విభిన్నంగా తీర్పును ఇస్తున్నారు. ఒకే పార్టీకి పట్టం, ఒకే అభ్యర్థిని పలుమార్లు గెలిపించే మూస ధోరణికి తాము దూరమని చెప్పకనే చెబుతున్నారు.

ఐదేళ్ల క్రితం టీఆర్ఎస్

చొప్పదండి అసెంబ్లీ స్థానానికి 2018 డిసెంబర్ 7న జరిగిన ఎన్నికల్లో చొప్పదండి ప్రజలు టీఆర్ఎస్‌ను గెలిపించారు. 42 వేల ఓట్ల పైచిలుకు మెజారిటీతో సుంకె రవిశంకర్‌ను గెలిపించారు. కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం రెండో స్థానంలో నిలిచాడు. ఆ వెంటనే వచ్చిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో, సర్పంచ్ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ అభ్యర్థులకే ప్రజలు పట్టం కట్టారు. టీఆర్ఎస్ ప్రభంజనం వీస్తుందని గెలిచి చూపించారు.

పార్లమెంట్‌లో బీజేపీ ఆధిక్యం

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన ఆరునెలలకు పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. కరీంనగర్ ఎంపీగా బీజేపీ నుంచి పోటీ చేసిన బండి సంజయ్‌కు చొప్పదండి నియోజకవర్గంలో అత్యధిక ఓట్ల ఆధిక్యత లభించింది. సుమారు 50 వేల ఓట్లకుపైగా మెజారిటీతో అప్పటి సిట్టింగ్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను బండి సంజయ్ ఓడించారు. ఆరు నెలల తేడాలో చొప్పదండి నియోజకవర్గ ఓటర్లు టీఆర్ఎస్ బదులు బీజేపీకి మద్దతు తెలిపారు. అప్పటివరకు టీఆర్ఎస్ కంచుకోట అని బలమైన నమ్మకంతో ఉన్న బీ(టీ)ఆర్ఎస్ లీడర్లకు ఓటర్లు షాక్ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా ఓడిన సానుభూతి, ప్రధాని మోదీ ఇమేజ్‌తో బండి సంజయ్ ఎంపీగా గెలిచారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కంటే చొప్పదండిలో అధిక మెజారిటీ రావడం గమనార్హం.

తాజాగా కాంగ్రెస్‌కు పట్టం

పదేళ్ల బీ(టీ)ఆర్ఎస్ పాలన పూర్తయ్యే సమయంలో నవంబర్ 30 జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ ఓటర్లు ఆ పార్టీకి కర్రు కాల్చి వాతపెట్టారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజారిటీతో పట్టం కట్టారు. సుమారు 37 వేల ఓట్ల పైచిలుకు ఓట్లతో మేడిపల్లి సత్యం సిట్టింగ్ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌పై గెలుపొందారు. ఇక పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీని చూసిన బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుస్తానని పోటీ చేసి ఓడిపోయారు. ఇలా చొప్పదండి నియోజకవర్గ ప్రజలు ఎటువైపు గాలివుంటే అటే మద్దతు ఇస్తున్నట్లు కనిపిస్తోంది. ఒకప్పుడు ఓ ప్రాంతీయ పార్టీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గం ఇప్పుడు తాజా రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా మారుతున్నట్లు అర్థమవుతోంది. దీంతో ఎవరు కూడా చొప్పదండి గడ్డ తమ అడ్డా అని చెప్పుకొనే పరిస్థితి లేకుండా పోతోంది.

పొన్నంతోనే హుస్నాబాద్ అభివృద్ధి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ గీకురు రవీందర్, కాంగ్రెస్ నాయకులు

చిగురుమామిడి: హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ విజయం సబ్బండ కులాలు, వర్గాలదేనని జెడ్పీటీసీ, కాంగ్రెస్ నాయకుడు గీకురు రవీందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అఖండ విజయాన్ని అందించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసే ప్రభుత్వమన్నారు. ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించడంలో ముందుంటారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అర్హులకే అందిస్తారని అన్నారు. పొన్నం హయాంలో హుస్నాబాద్ నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందనుందన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, డీసీసీ అధికార ప్రతినిధి ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు స్వప్న, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పొన్నం సంపత్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షాబుద్దీన్, గ్రామశాఖ అధ్యక్షుడు కనకయ్య, నాయకులు లచ్చిరెడ్డి, మల్లారెడ్డి, అంజయ్య, భగవాన్‌ప్రసాద్, బాబు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల పూజలు



కరీంనగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిచినా సందర్భంగా కమాన్‌పూర్‌లోని అభయాంజనేయ ఆలయంలో సోమవారం యూత్ కాంగ్రెస్ కొత్తపల్లి మండల అధ్యక్షుడు బూస ప్రశాంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పూజలు చేశారు. పూజల్లో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంజాల స్వామిగౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు మదుపు మోహన్, నాయకులు శ్రవణ్‌నాయక్, సిరిపురం నాగప్రసాద్, అంజయ్య, పంజాల కృపసాగర్, శ్రీనివాస్, ప్రభాకర్, మనోహర్, చంద్రయ్య, మల్లేశం, అనిల్‌గుప్తా, కిషన్, సంపత్, శేఖర్, రాజు, రమేశ్, సత్యం, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, గిర్ర రమేశ్, సంతోష్, రవి, భరత్ తదితరులు పాల్గొన్నారు.





కార్తీక సోమవారం పూజలు

కార్తీక మాసం పురస్కరించుకొని నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతబజార్ గౌరీశంకరాలయంలో అర్చనలు, అభిషేకలు జరిపారు. మహిళలు దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఉడుతల వెంకన్న, ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. - కరీంనగర్‌కల్చరల్







ప్రముఖుల ఇలాఖాలో ఓట్లు తారుమారు

- బీఆర్ఎస్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డి వైపే మొగ్గు చూపిన జనం
- వీణవంక జెడ్పీటీసీ స్వగ్రామంలో బీజేపీ ఆధిక్యం
- జెడ్పీ చైర్‌పర్సన్ సొంత గ్రామంలో 73 ఓట్ల స్వల్ప మెజార్టీ



వీణవంక: హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూసిన ఎన్నికల ఫలితాలకు ఆది వారంతో తెరపడింది. ఎంపీపీలు, జెడ్పీటీసీల స్వగ్రామాల్లో స్వల్ప మెజార్టీ మాత్రమే సాధించారు. వీణవంక జెడ్పీటీసీ మాడ వనమాల(బీఆర్ఎస్) స్వగ్రామంలో మాత్రం బీజేపీ ఆధిక్యం ప్రదర్శించింది. హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీణవంక, జమ్మికుంట, ఇల్లందకుంట, హుజూరాబాద్ మండలాలలో దాదాపు స్వల్ప మెజార్టీతో బయటపడ్డారు. వీణవంక మండలం చల్లూర్ గ్రామంలో మాత్రం ఏఎంసీ మాజీ చైర్మన్ వాల బాలకిషన్‌రావు(బీఆర్ఎస్) పట్టు నిలుపుకున్నారు. ఇక్కడ బీఆర్ఎస్‌కు 700 మెజార్టీ వచ్చింది. మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఇలాఖ సింగాపూరంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రణవ్‌కు 757ఓట్ల ఆధిక్యం దక్కింది.

వీణవంకలో...

వీణవంక మండలం ఎల్బాక గ్రామంలో బీజేపీకి 685, బీఆర్ఎస్‌కు 584ఓట్లు వచ్చాయి. ఇక్కడ బీజేపీకి 101 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఇదే గ్రామంలో బీఆర్ఎస్ నుంచి జెడ్పీటీసీ మాడ వనమాలసాదవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మవురం విజయభాస్కర్ రెడ్డి, సర్పంచ్ కొత్తిరెడ్డి కాంతారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరు బీఆర్ఎస్ ఇన్‌చార్జీలుగా వ్యవహరించినప్పటికీ ఓట్లు రాబట్టలేకపోయారు. దేశాయిపల్లిలో బీఆర్ఎస్‌కు 471 ఓట్లు, బీజేపీకి 387ఓట్లు మాత్రమే వచ్చాయి. బీ ఆర్ఎస్‌కు 84ఓట్ల మెజార్టీ మాత్రమే దక్కింది. ఇక్కడ ఎంపీపీ ముసిపట్ల రేణుక ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

హుజూరాబాద్‌లో...

ఎంపీపీ ఇరుమల్ల రాణి సొంత గ్రామం చెల్పూర్‌లో బీఆర్ఎస్‌కు 1,382 ఓట్లు వస్తే .. బీజేపీకి 857, కాంగ్రెస్‌కు 1,233 ఓట్లు పడ్డాయి. 149ఓట్ల మెజార్టీ బీఆర్ఎస్‌కు దక్కింది. జెడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి కందుగులలో 39ఓట్ల మెజార్టీ సాధించింది.

జమ్మికుంట, ఇల్లందకుంటలో ...

జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ స్వగ్రామం ఇల్లందకుంటలో బీఆర్ఎస్ 1,041, బీజేపీ 798, కాంగ్రెస్ 967 ఓట్లు వచ్చాయి. ఇక్కడ 74ఓట్ల స్వల్ప మెజార్టీతో బీఆర్ఎస్ ఆధిక్యం వచ్చింది. ఇల్లందకుంట మండలం బూజునూరులో 279ఓట్ల మెజార్టీ బీఆర్ఎస్‌కు వచ్చింది. ఇక్కడ ఎంపీపీ సరిగొమ్మల పావని ప్రాతినిధ్యం వహిస్తున్నాది. ఇక్కడ కాంగ్రెస్ గట్టి పోటీనిచ్చింది. జమ్మికుంట జెడ్పీటీసీ శ్రీరాం శ్యాం(బీజేపీ) స్వగ్రామం అబాది జమ్మికుంటలో కాంగ్రెస్ పార్టీ పోటీనిచ్చింది. బీఆర్ఎస్ 322, కాంగ్రెస్ 233, బీజేపీకి 153 ఓట్లు వచ్చాయి. శ్రీరాం శ్యాం ఇటీవల బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. 169ఓట్ల మెజారిటీతో బీఆర్ఎస్‌కు ఆధిక్యం వచ్చింది. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు వార్డులో బీజేపీ గట్టి పోటీనిచ్చింది. బీఆర్ఎస్‌కు కేవలం 4 ఓట్ల ఆధిక్యం వచ్చింది. జమ్మికుంట ఎంపీపీ దొడ్డ మమత(బీఆర్ఎస్) స్వగ్రామం పెద్దంపల్లిలో బీఆర్ఎస్‌కు 178ఓట్ల మెజార్టీ దక్కింది.

ప్రజా తీర్పును గౌరవిస్తున్నా

- బీజేపీ అభ్యర్థి ఆరెపల్లి మోహన్
- ఎమ్మెల్యే కవ్వంపల్లికి శుభాకాంక్షలు



మాట్లాడుతున్న ఆరెపల్లి మోహన్

మానకొండూర్: ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తానని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి ఆరెపల్లి మోహన్ అన్నారు. మానకొండూర్‌లో సోమవారం సమావేశంలో మాట్లాడారు. స్థానిక నాయకుడిని అయినప్పటికీ ప్రజలు మార్పు కోరుకున్నారని, ప్రజాస్వామ్యయుతంగా జరగాల్సిన ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ ద్వయం, డబ్బులు పంపిణీ చేశాయని ఆరోపించారు. ఇది మంచిది కాదన్నారు. ప్రజాస్వామ్యాన్ని ప్రజలే కాపాడుకోవాలని సూచించారు. బీజేపీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యేగా గెలిచిన కవ్వంపల్లి సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, కొంరయ్య, సమ్మిరెడ్డి, కల్యాణ్‌చంద్ర, జగన్‌రెడ్డి, ప్రవీణ్, అనిల్, లక్ష్మణాచారీ, స్వప్న, శ్రీనివాస్, ప్రదీప్‌యాదవ్, బలరాం, తిరుపతి, రాకేశ్, రాజయ్య, క్రాంతి పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించాలి



మాట్లాడుతున్న ఏపీడీ సంధ్యారాణి

శంకరపట్నం: గ్రామాల్లోని ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ఏపీడీ సంధ్యారాణి అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఫీల్డ్‌అసిస్టెంట్లు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏపీడీ మాట్లాడుతూ.. గ్రామాల్లో పనులు కల్పించి ఎక్కువ సంఖ్యలో కూలీలు హాజరయ్యే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీవాణి, ఏపీఓ శారద తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా శ్రీదుబ్బ మల్లికార్జునస్వామి కల్యాణం



జమ్మికుంట: పట్టణంలోని ధర్మారం గ్రామం పరిధి శ్రీదుబ్బ మల్లికార్జునస్వామి దేవాలయంలో కేతలమ్మ, మేడలమ్మతో స్వామివారి కల్యాణం సోమవారం తెల్లవారుజామున ఆలయ పూజారులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దృష్టి కుంబం, పెద్దపట్నం వేసి పూజారులు కల్యాణం జరిపించారు. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు రాధిక దంపతులు, కుటుంబ సభ్యులు స్వామివారి కల్యాణానికి హాజరయ్యారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఒగ్గు పూజారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలోనిఅయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం మాజీ ఈవో ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి క్యాలెండర్‌ను అర్చకుడు మంగళంపల్లి రాజేశ్వరశర్మ, అయ్యప్ప సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్ ఆవిష్కరించారు.